క్లుప్తంగా

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



నందిగామ: డివిజన్ పరిధిలోని అన్ని కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని ఆర్డీఓ రవీంద్రరావు తెలిపారు. పట్టణంలోని కేవీఆర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలో పరీక్షలు జరుగుతున్న తీరు, తాగునీటి ఏర్పాట్లు, అవసరమైతే ఫస్ట్ ఎయిడ్ కోసం ఆరోగ్యశాఖ సిబ్బందికి సంబంధించిన అన్ని అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు చక్కటి వెంటిలేషన్ సౌకర్యం ఉన్న రూములు ఏర్పాటు చేశామన్నారు. తాగు నీటి వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముందు జాగ్రత్తగా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద ఆరోగ్య శాఖ సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన



నందిగామ: ఎన్నికల నియమావళిపై అన్ని రాజకీయ పార్టీల నాయకులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఆర్డీఓ ఏ రవీంద్రరావు సూచించారు. పట్టణంలోని కేవీఆర్ కళాశాలలో మంగళవారం నియోజకవర్గ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులకు ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నిపుణులైన వారిచే ఈ అవగాహన కార్యక్రమం జరిగింది. అన్ని పార్టీల రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

కుమారుడు అదృశ్యంపై ఫిర్యాదు

నందిగామ: తన కొడుకు కనిపించడం లేదని ఓ తండ్రి మంగళవారం నందిగామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై దుర్గ మహేశ్వరరావు తెలిపిన సమాచారం ప్రకారం.. మండలంలోని మాగల్లు గ్రామానికి చెందిన గుంటి తరుణ్ బీటెక్ పూర్తి చేసి గత ఆరు నెలలుగా హైదరాబాదులో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఫిబ్రవరి 28వ తేదీన స్వగ్రామమైన మాగల్లు వచ్చాడు. తిరిగి మార్చి ఒకటో తేదీ రాత్రి 9:45 హైదరాబాదు వెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. ఆ తరువాత ఎటువంటి సమాచారం లేకపోగా ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉంది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

వీరులపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ రాజకిషోర్ పేర్కొన్నారు. మండలంలోని జగన్నాథపురం, నరసింహారావుపాలెం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, సిబ్బంది ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శివప్రసాద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

12న ప్రజాభిప్రాయ సేకరణ

జగ్గయ్యపేట: మండలంలోని గౌరవరం గ్రామంలో ఈ నెల 12న ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణకు సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు విజయవాడ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఈఈ పి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. గ్రామంలోని సర్వే నంబర్ 22/3బీ, 22/4, 23/1,2,3,4లోని 8.84 ఎకరాల్లో వేదాద్రి ఎన్విరోటెక్ ఫౌండేషన్ కర్మాగారం ఏర్పాటు చేసేందుకు ఉదయం 11 గంటలకు సదస్సు జరుగుతుందన్నారు. గ్రామస్తులు, పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు తమ అభిప్రాయాన్ని వెల్లడించవచ్చన్నారు.

అసభ్యంగా ప్రవర్తించాడని వైద్యుడిపై ఫిర్యాదు

విస్సన్నపేట: తన సోదరికి ఆపరేషన్ నిమిత్తం తోడుగా ఆస్పత్రికి వచ్చిన తనతో వైద్యుడు అసభ్యకరంగా ప్రవర్తించాడని ఓ మహిళ స్థానికపోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. మండలంలోని తాతకుంట్ల గ్రామానికి చెందిన ఒక మహిళకు ఆపరేషన్ నిమిత్తం విస్సన్నపేట లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చగా, ఆదివారం ఆపరేషన్ చేశారు. సోమవారం రాత్రి పేషంట్‌కు తోడుగా ఉన్న మహిళను డాక్టర్ సీతారామ్ పిలిచి అసభ్యంగా ప్రవర్తించాడని పేషెంట్ అటెండెంట్‌గా వచ్చిన మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వైద్యుడు తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లిలో డెప్యూటీ డీఎంహెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్నారని తెలుస్తోంది.

ప్రభుత్వ పాఠశాలలకు ప్రాణ ప్రతిష్ట చేసిన సీఎం

- ప్రభుత్వ విప్ ఉదయభాను
- రూ.కోటి వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



పేట జెడ్పీ బాలుర హైస్కూల్ తరగతి గదులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మకమైన సంస్కరణలతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రాణప్రతిష్ట చేశారని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే ఉదయభాను కృషితో నాడు-నేడు పథకం ఫేస్-2 ద్వారా పట్టణంలోని పలు పాఠశాలల్లో సుమారు రూ.కోటి వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను మంగళవారం ఎమ్మెల్యే ఉదయభాను ప్రారంభించారు. నాగమయ్య బజారులోని ఎంపీయూపీ స్కూల్‌లో నిర్మించిన అదనపు తరగతి గదులను, మిట్టగూడెంలోని ఉర్దూ స్కూల్‌లో అదనపు తరగతి గదులు, మౌలిక వసతులను, జీవీజే జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో 8 అదనపు తరగతి గదులు, కాకానినగర్‌లోని ఎంపీపీ స్కూల్‌లో అదనపు తరగతి గదులు, సీతారామపురం ఎంపీపీ స్కూల్‌లో అదనపు తరగతి గదులు, మౌలిక వసతులు తదితర అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా శిథిలమై అభివృద్ధికి నోచుకోని పాఠశాలల రూపురేఖలనే నాడు-నేడు పథకం ద్వారా ఉన్నతంగా తీర్చిదిద్దామన్నారు. నేడు ప్రభుత్వ పాఠశాలల్లో సీట్ల కోసం రికమెండేషన్లు చేయించుకోవాల్సిన పరిస్థితి తీసుకువచ్చారని తెలిపారు.

పేటలోని జీవీజే జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో పూర్వ విద్యార్థిని అయిన నేను ఈ పాఠశాల అభివృద్ధిలో పాలపంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇటీవలనే స్థానికంగా కర్మాగారాల కృషితో రూ.20 లక్షలతో డైనింగ్ హాల్ ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో స్టేజీ, గ్రౌండ్ ఆధునీకీకరణ, జిమ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ పాఠశాలలో నాడు-నేడులో రూ.1.42 కోట్ల వ్యయంతో 11 తరగతి గదుల నిర్మాణ పనులను ఈ స్కూల్ పూర్వ విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి షేక్ బాజానీ నాయకత్వంలో ఒక కమిటీగా ఏర్పడి నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వారిని, తల్లిదండ్రుల కమిటీని, ఉపాధ్యాయుడు ఎం.కృష్ణయ్యను సన్మానించారు. ఎంఈవో చిట్టిబాబు, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఏఎంసీ చైర్మన్ మానేపల్లి నాగబ్రహ్మం, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఫిరోజ్‌ఖాన్, పార్టీ పట్టణ, మండల యూత్ అధ్యక్షులు ఆవాల భవానీప్రసాద్, బజారు సాయి, నాయకులు కాశి కిషోర్, దువ్వల రామకృష్ణ, సాధుపాటి రాజు, గోగుల వెంకయ్య, అల్లూరి భాస్కర్, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అభివృద్ధి పథంలో గ్రామాలు

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- ఏటూరులో గడప గడపకు మన ప్రభుత్వం



ఏటూరులో మహిళకు పథకాల బెక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి పథంలో సాగుతున్నాయని శాసన సభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలంలో ఏటూరు గ్రామంలో మంగళవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయటంతో పాటు ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని కానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి భారీ విజయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు కందుల నాగేశ్వరరావు, వైఎస్ఎన్ ప్రసాద్, ముఖర్జి, ధనమూర్తి, రాము, వేణు, పలువురు నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్నపై నమ్మకంతోనే భారీ చేరికలు



కండువా కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి తోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ ఉందని భావించిన అనేక మంది భారీగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో పేట మండలంలోని బండిపాలెం గ్రామానికి చెందిన 15 మంది టీడీపీని వీడి ఎమ్మెల్యే ఉదయభాను సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలో దీరంగుల వెంకమ్మ, పెనుగొండ వెంకటేశ్వర్లు, పెనుగొండ అంజి, పెనుగొండ శ్రీను, పెనుగొండ వెంకన్న, పెనుగొండ సరోజ, ఉప్పుతోళ్ల సత్యం, ఉప్పుతోళ్ల సత్యానంద్, వేముల వెంకయ్య, ఒంటిపులి చెన్నారావు, ఒంటిపులి గోపి, ఒంటిపులి దుర్గ, వేముల చిన్న వెంకయ్య, వేముల శివ, వేముల పెద వెంకయ్య ఉన్నారు. పెనుగంచిప్రోలు తిరుతమ్మ దేవస్థానం చైర్మన్ జంగాల శ్రీనివాసరావు (వాసు), పేట ఏఎంసీ వైస్ చైర్మన్ గూడపాటి శేషగిరిరావు, సొసైటీ అధ్యక్షుడు కాసరగడ్డ రామారావు, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు కాసరగడ్డ సీతామహాలక్ష్మి, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, గ్రామ నాయకుడు బండి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

అనుమంచిపల్లి నుంచి 30 మంది చేరిక..

పేట మండలంలోని అనుమంచిపల్లి గ్రామం, ఎస్సీ ఏరియాకు చెందిన 30 మంది కార్యకర్తలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకట కృష్ణప్రసాద్ సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో ఆరెకంటి ప్రసాద్, ఆరెకంటి రాజు, ఉప్పుతోళ్ల లక్ష్మణరావు, దేవళ్ల విజయలక్ష్మి, సూరంపల్లి నాగేంద్రబాబు, రేవూరి నాగరాజు తదితరులు ఉన్నారు. గ్రామ సర్పంచ్ పి.లక్ష్మి త్రివేణి నాయుడు, పార్టీ గ్రామ అధ్యక్షుడు కుందవరపు సుబ్బారావు, మాజీ ఎంపీపీ మాతంగి వెంకటేశ్వర్లు, రైతుభరోసా చైర్మన్ గొలినేని రవి తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం



తిరుమలగిరిలో ఇటుక బట్టీల వద్ద చిన్నారుల తల్లిదండ్రులతో డీఎంహెచ్‌వో సుహాసిని

జగ్గయ్యపేట: జిల్లాలో ఆదివారం జరిగిన పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతం అయిందని డీఎంఅండ్ హెచ్‌వో మాచర్ల సుహాసిని తెలిపారు. మండలంలోని తిరుమలగిరి, జయంతిపురం గ్రామాల్లో మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కల మందు తప్పనిసరిగా అందించాలని వైద్య ఆరోగ్యశాఖ చర్యలు తీసుకుందన్నారు. జిల్లాలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చుక్కల మందు వేసుకోనివారిని గుర్తించి వారికి పోలియో చుక్కలు వేశారన్నారు. కొన్ని గ్రామాలకు పలు రాష్ట్రాల నుంచి వలసలు వచ్చి గుడారాలు వేసుకుని నివసించే ప్రాంతాలను కూడా వైద్య సిబ్బంది గుర్తించి వారికి అవగాహన కల్పించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారన్నారు. అనంతరం గ్రామాల్లో ఇటుక బట్టీల కేంద్రాల వద్ద నివాసం ఉంటున్న చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేశారో లేదో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బూచవరం ప్రభుత్వాసుపత్రి వైద్యులు అనిల్‌కుమార్, స్రవంతి, కీర్తిరెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

జగ్గయ్యపేట: పట్టణంలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో జిల్లా వైద్యాధికారి మాచర్ల సుహాసిని మంగళవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కోదాడ రోడ్డులోని వెంకటసన్నీ, విక్రమ్ ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ రెండు ఆస్పత్రులకు సంబంధిచిన అనుమతి పత్రాలు సక్రమంగా లేకపోవడంతో యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 రోజుల పాటు ఆస్పత్రులను సీజ్ చేయాలంటూ ఆదేశించారు. శ్రీలక్ష్మి కంటి వైద్యశాలను పరిశీలించారు.

వైభవంగా ప్రారంభమైన కల్యాణోత్సవాలు



పెండ్లి కుమారుని అలంకరణలో భవానీ ముక్తేశ్వర స్వామి

ముక్త్యాల(జగ్గయ్యపేట): స్థానిక భవానీ ముక్తేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు వారణాసి సాంబశివరావు ఆధ్వర్యంలో నది ఒడ్డున ఉన్న ముక్తేశ్వర స్వామి ఆలయంలో సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏడాది తరువాత పవిత్రజలాలతో శుద్ధి చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామి వారిని పెండ్లి కుమారుడిగా అలంకరించారు. అర్చకులు తూమాటి లక్ష్మీనరసింహాచార్యులు, మద్దిరాల ప్రేమ్‌కుమార్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో జయప్రకాష్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కేసీపీ ప్రతినిధులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు నూతన భవనాల ప్రారంభోత్సవం



సచివాలయ భవనం



రైతు భరోసా కేంద్రం



ఓవర్‌హెడ్ ట్యాంక్

శివాపురం(పెనుగంచిప్రోలు): మండలంలోని శివాపురం గ్రామంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో నిర్మించిన నూతన భవనాలు ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. రూ.45 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.21 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే, రూ.29 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను బుధవారం సాయంత్రం గ్రామ నాయకుడు లగడపాటి నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

క్రీడలతో శారీరక రుగ్మతలు దూరం



జిమ్‌లో క్రీడాకారులకు టీ షర్ట్స్ అందజేస్తున్న దాత శ్రీకాంత్

మైలవరం: క్రీడలతో శరీర రుగ్మతలు తొలగుతాయని, మానసిక ఉల్లాసం కలుగుతుందని దాత బత్తుల శ్రీకాంత్ తెలిపారు. మైలవరం ఫిట్ జోన్ జిమ్ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు 25 మందికి మంగళవారం ఆయన టీషర్ట్స్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతమైన మైలవరంలో ఫిట్ జోన్ జిమ్ నిర్వహించడం సంతోషదాయకమన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిమ్ కోచ్ బుడిపుటి వెంకట్రావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష



తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

నందిగామ: భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సరస్వతి సూచించారు. శివరాత్రి నేపథ్యంలో మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవ వేడుకలు ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో తిరునాళ్ల ఏర్పాట్లపై మంగళవారం ఆలయం వద్ద పలు శాఖల అధికారులతో తహసీల్దార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తిరునాళ్లకు వచ్చే భక్తులకు కల్పించవలసిన ఏర్పాట్లు, బారికేడ్ల ఏర్పాటు, తాగునీరు, పుణ్య స్నానాలకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆలయ చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు, ఆలయ ఈవో భూపాల్, ఇన్‌స్పెక్టర్ హనీష్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బొమ్మల కళాకారులకు టూల్స్ పంపిణీ



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కేంద్ర హస్తకళల కమిషనర్ కార్యాలయం నుంచి మంజూరైన మెరుగైన టూల్ కిట్లను న్యూఢిల్లీకి చెందిన జాతీయ డిజైన్ సెంటర్ ప్రతినిధులు టాయ్స్ కమ్యూనిటీ భవనంలో మంగళవారం కొండపల్లి బొమ్మల కళాకారులకు పంపిణీ చేశారు. కేంద్ర హస్తకళల శాఖ ప్రమోషన్ అధికారి సువర్చల మాట్లాడుతూ కొండపల్లి చెక్క బొమ్మల కళాకారులు సమాజానికి మెరుగైన బొమ్మలు అందించాలనే లక్ష్యంతో హస్తకళల కమిషనర్ వారి కార్యాలయం ద్వారా 147మందికి టూల్‌కిట్లు అందజేశామన్నారు. టూల్‌కిట్లుతో ఆకర్షణీయమైన బొమ్మలు తయారు చేయాలని కోరారు.

కేంద్ర పోలీసు బలగాల కవాతు



కంచికచర్లలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



పెనుగంచిప్రోలులో..

కంచికచర్ల: పట్టణంలో కేంద్ర పోలీసు బలగాలు మంగళవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు వారికి ధైర్యం కల్పించేందుకు కవాతు నిర్వహిస్తున్నామని అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి ఓస్లీ క్లబ్, అంబేద్కర్‌సెంటర్, అంబేడ్కర్ నగర్, అరుంధతీ నగర్, పెద్ద బజార్, నెహ్రూ బొమ్మ సెంటర్, జుజ్జూరు రోడ్డు మీదుగా వసంతకాలనీ, గొట్టుముక్కల రోడ్డు, వసంతకాలనీ, ఇందిరా కాలనీ, హనుమాన్ పేట, మోడల్‌కాలనీ వరకు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు ఎస్ఐలు పీవీఎస్ సుబ్రహ్మణ్యం, హైమావతి, మహాలక్ష్ముడు, ధర్మరాజు, ఏఎస్ఐలు మంగ్యానాయక్, రామారావు, కానిస్టేబుళ్లు, సాయుధ బలగాలు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు శాంతిభద్రతలపై అవగాహన కల్పించేందుకు కేంద్ర పోలీసు బలగాలు కవాతు నిర్వహించారు. మంగళవారం పెనుగంచిప్రోలుతో పాటు అనిగండ్లపాడు, శివాపురం గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పారా మిలటరీ దళాలతో నిర్వహించిన కవాతులో పెనుగంచిప్రోలు, చిల్లకల్లు ఎస్ఐ పి.రాంబాబు, సతీష్, ఏఎస్ఐ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

తిరునాళ్లకు కొత్త హంగులు

వెల్వడం(మైలవరం): మైలవరం మండలం వెల్వడం గ్రామంలో శ్రీబాలకోటేశ్వరస్వామి తిరునాళ్లు (శివరాత్రి మహోత్సవం)కు వెల్వడం నుంచి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారితో పాటు పరిసరాలు కొత్త హంగులు సంతరించుకున్నాయి. వెల్వడంకు చెందిన ప్రవాసాంధ్రులు ఆలయానికి వెళ్లే మట్టి రోడ్డును తారురోడ్డుగా అభివృద్ధి చేశారు. ఈ రోడ్డును మంగళవారం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి, లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి, కె.కోటారెడ్డి ప్రారంభించారు. వెల్వడం గ్రామస్తులకు శివరాత్రి తిరునాళ్లు పెద్ద పండుగ. ఈ పండుగకు గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రులు అందరూ వెల్వడం గ్రామానికి చేరుకుని గ్రామస్తులంతా ఒక కుటుంబ పండుగలా జరుపుకొంటారు. వెల్వడం శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయానికి 170 సంవత్సరాల చరిత్ర ఉంది. గతంలో మైలవరం నుంచే కాక తిరువూరు, గంపలగూడెం, ఖమ్మం, మధిర, నూజివీడు తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు ఎడ్ల బండ్లు కట్టుకుని వచ్చి, గిరి ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకునే వారు. ప్రస్తుతం ప్రవాసాంధ్రుల సహకారంతో రోడ్డు వేయడంతో పాటు భక్తులు ఎల్లవేళలా వచ్చి తమ మొక్కులు తీర్చుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, లకిరెడ్డి సిద్ధార్థరెడ్డి, దుంపా వెంకటేశ్వరరెడ్డి, జి.శ్రీనివాసరెడ్డి, లకిరెడ్డి సుధాకరరెడ్డి, కె.తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శివాలయం రోడ్డును ప్రారంభిస్తున్న డాక్టర్ హనిమిరెడ్డి, జయప్రకాశ్‌రెడ్డి

దాడులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

ముసునూరు: దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదైనట్లు ఎస్ఐ పి.వాసు తెలిపారు. మంగళవారం వివరాలు వెల్లడించారు. రమణక్కపేటకు చెందిన ఉప్పే శ్రీనివాసరావు పంచాయతీ స్థలం ఆక్రమించి, ఇల్లు నిర్మిస్తున్నాడంటూ అదే గ్రామానికి చెందిన ఉప్పే శివనాగాంజనేయులు(బాబి) గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం సాయంత్రం ఇంటి స్థల వివాదంపై గ్రామ కార్యదర్శి, మరో అధికారితో కలిసి విచారణకు వెళ్లారు. దీనిపై శ్రీనివాసరావు వివరణ ఇస్తూ ఉండగా ఫిర్యాదు చేసిన ఉప్పే బాబిని కార్యదర్శి అక్కడికి పిలిపించారు. అతను రావడంతోనే శ్రీనివాసరావుపై గొడవకు దిగి, కర్రతో విచక్షణారహితంగా కొట్టడంతో, తీవ్రగాయాల పాలయ్యాడు. శ్రీనివాసరావును 108 వాహనంలో నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడని, మంగళవారం ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో కేసు నమోదుచేశామని ఎస్ఐ తెలిపారు.